సాక్షి
నిజామాబాద్
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



టోల్ చార్జీల పెంపు

జాతీయ రహదారులపై పెంచిన టోల్ చార్జీలను నేటి నుంచి వసూలు చేయనున్నారు.

- 10లో ▸



మోదీలకు అండగా..

అదానీ, అంబానీ, లలిత్ మోదీ, నీరవ్ మోదీలకు బీజేపీ ప్రభుత్వం అండగా నిలబడుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
39.4 /24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



వేదనాభరితం..!

■ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆగని బలవన్మరణాలు ■ మరణ మృదంగం మోగుతోందా! ■ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఏదీ..!

ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికోల బలవన్మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. నెల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. అయితే వీరి ఆత్మహత్యల వెనుక కారణాలపై స్పష్టత లేదు. విద్యార్థులు సైతం సూసైడ్ నోట్‌లలో ప్రస్తావించ లేదు. చదువులో ప్రతిభ కలిగిన విద్యార్థులు అర్థంతరంగా తనువు చాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- 36 రోజుల వ్యవధిలో ఇద్దరు మెడికోల ఆత్మహత్య
- మొన్న హర్ష.. నేడు సనత్
- పది నెలల కిత్రం అనుమానాస్పద స్థితిలో వైద్య విద్యార్థిని మృతి
- మృతులు ముగ్గురు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల వాసులు
- నిజామాబాద్ మెడికల్ కళాశాలలో అలజడి



విలపిస్తున్న తల్లి సుజాత



సనత్(ఫైల్)

చదువులో ప్రతిభావంతుడు..

నిజామాబాద్ అర్బన్ : బలవన్మరణం చెందిన ప్రభుత్వ మెడికల్ కళాశాల ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థి మోసం సనత్ (22) మొదటి నుంచి చదువులో ముందంజలో ఉన్నారు. పెద్దపల్లి జిల్లా రామగిరికి చెందిన సనత్ 2020 బ్యాచ్‌కు చెందిన వాడు. 2016లో పదవ తరగతిలో 9.2 జీపీ సాధించాడు. ఇంటర్‌లో 977 మార్కులు సాధించాడు. ఆల్ ఇండియా నీట్‌లో 82097 ర్యాంక్ సాధించాడు. 505 మార్కులు వచ్చాయి. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం వరకు చదువులో ముందంజలో ఉన్నాడు. ఇటీవల ఫైనల్ పరీక్షలు రాశాడు. శనివారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గురువారం స్నేహితులతో సరదగా గడిపిన సనత్ సినిమాకు వెళ్లాడు. సాయంత్రం క్రికెట్ ఆడాడు. అంతలోనే ఈ ఘాతుకానికి పాల్పడినాడు. అందరితో కలిసిమెలిసి ఉండే సనత్ అకస్మాత్తుగా ఆత్మహత్య చేసుకోవడంపై స్నేహితులు, తోటి మెడికోలు బోరున విలపించారు. సనత్ మరణానికి మాత్రం కారణాలు తెలియరావడం లేదు.

← కొడుకు మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి రమేశ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మోగుతున్న మరణ మృదంగం కలవరపెడుతోంది. విద్యార్థుల వరుస ఆత్మహత్యలు అలజడి రేపుతున్నాయి. కేవలం 36 రోజుల వ్యవధిలో ఇద్దరు వైద్య విద్యార్థులు ఉరేసుకుని చనిపోవడంతో కలకలం నెలకొంది. శుక్రవారం తెల్లవారు జామున మోసం సనత్ అనే ఎంబీబీఎస్ సెకండియర్ విద్యార్థి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీ కాలనీకి చెందిన రమేశ్, సుజాత దంపతుల కుమారుడు సనత్.

ఇదిలా ఉండగా గత ఫిబ్రవరి 25న ఇదే హాస్టల్‌లో దాసరి హర్ష అనే ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హర్ష మంచిర్యాల జిల్లా జన్నారం మండ లం చింతగూడకు చెందినవాడు. వీరిద్దరూ ఎందు కు ఆత్మహత్యలు చేసుకున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇక మరోవైపు 2022 మే 13న డాక్టర్ శ్వేత అనే మెడికల్ పీజీ విద్యార్థిని అనుమానాస్పదంగా గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో ప్రసూ తి విభాగంలో విధినిర్వహణ సమయంలోనే అర్ధరాత్రి మృతి చెందడం గమనార్హం. శ్వేత కరీంనగర్‌కు చెందిన నిరుపేద కుటుంబం నుంచి వచ్చి అత్యుత్తమ ప్రతిభతో పీజీ సీటు సాధించింది. ఇప్పటికీ శ్వేత మరణంపై ఒక స్పష్టత లేకపోవడం గమనార్హం. పీజీ మెడికల్ పూర్తయ్యే సమయంలో శ్వేత మరణించడం పలువురిని చలింపజేసింది.



శ్వేత(ఫైల్)



హర్ష(ఫైల్)

ఇక 2022లోనే కళాశాలలో చదువుతున్న పీజీ ఫైనలియర్ విద్యార్థి రోహిత్‌రెడ్డి ఆర్మూర్ మండలం అంకాపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఇక 2013లో మొదటి బ్యాచ్‌కు చెందిన ఓ వైద్య విద్యార్థిని కుటుంబ కలహాలతో హైదరాబాద్‌లో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే వరుసగా శ్వేత, హర్ష, సనత్ మరణాలు మాత్రం తోటి విద్యార్థులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. వీరి ముగ్గురి మరణాలు అంతుపట్టకుండా ఉండడంతో ఏం జరుగుతోందనే గందరగోళ వాతావరణం కళాశాలలో నెలకొంది. 2013లో 100 సీట్లతో నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభమైంది. తరువాత పీజీ విద్య సైతం ప్రారంభమైంది. నగరం నడిబొడ్డున ఉన్న ఈ కళాశాలలో విద్యార్థుల వరుస మరణాల పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి వరకు తోటి విద్యార్థులతో చలాకీగా ఉండడంతో పాటు వైద్యసేవలు సైతం అందజేస్తూ అకస్మాత్తుగా మరణిస్తుండడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఒత్తిడి తట్టుకోలేక మరణిస్తున్నారా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనేది తెలియాల్సి ఉందని పలువురు అంటున్నారు.

“ సనత్ ఆత్మహత్య బాధాకరం..



మెడికో విద్యార్థి మోసం సనత్ హాస్టల్‌లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవటం ఎంతో బాధాకరం. మెడికల్ కళాశాలలో అనుకోని రెండో ఘటన ఇది. సనత్ చదువులో చాలా ప్రతిభావంతుడు. మార్చి 25 వరకు థియరీ పరీక్షలు రాశాడు. శనివారం నుంచి ప్రాక్టికల్స్ మొదలు కానున్నాయి. తోటి విద్యార్థుల గదికి వెళ్లి గురువారం అర్ధరాత్రి రెండు గంటల వరకు కలిసి చదువుకున్నాడు. అనంతరం గదికి వచ్చి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం మిగతా ఇద్దరు రూమ్‌మేట్స్ గదికి వచ్చి తలుపుకొట్టినా సనత్ తీయలేదు. దీంతో వారు బలవంతంగా తలుపును తెరిచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. అతనికి కుటుంబ పరంగా సమస్యలు లేవు. ఆరోగ్య సమస్యలు లేవు. ఎంతో కష్టపడి ఎంబీబీఎస్ సీట్ సాధించి ఇలా ప్రాణాలు తీసుకోవటం సరైంది కాదు. ఒక్క నిమిషం పాటు ఆలోచిస్తే బాగుండేది.

– ఇందిర, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్

ఒత్తిళ్లు జయిస్తేనే డాక్టర్ అవుతారు

డాక్టర్ చదువు టఫ్‌తో కూడుకున్నది. ఒత్తిళ్లు ఉంటాయి. ఈ ఒత్తిళ్ల జయించటం ఎలా అనే అంశంపై వారికి ఫస్ట్ ఇయర్‌లోనే క్లాసులు చెబుతాం. మార్చి మొదటివారం నుంచి వారికి కౌన్సెలింగ్ క్లాసులు నిర్వహిస్తున్నాం. ఒత్తిళ్లు తట్టుకోలేక కొంతమంది నిరాశ నిస్పృహలకు గురవుతారు. అటువంటి వారు బయటకు చెప్పుకోలేక ఇలాంటి పరిస్థితులకు దారితీస్తాయి. చదువులో ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న విద్యార్థులు మా దృష్టికి తీసుకువస్తే వారికి సాయం చేసేందుకు మేము ఎప్పుడూ సిద్ధమే. డాక్టర్ కావాలంటే కష్టపడాలి, శ్రమించాలి, ఒత్తిళ్లు ఎదుర్కోవాలి. అయితేనే డాక్టర్లు అవుతారు. సనత్ ఆత్మహత్యకు దారితీసి కారణాలపై కూలంకశంగా చర్చించి ఏ రకమైన చర్యలు తీసుకుంటే మరోసారి ఇలాంటివి జరుగవో అలాంటి చర్యలు తీసుకుంటాం. విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడకుండా వారిలో మార్పులు తీసుకువస్తాం.

–డాక్టర్ శివప్రసాద్, ప్రభుత్వ కళాశాల సైకియాట్రిస్ట్

దర్యాప్తు చేస్తున్నాం

మెడికల్ కాలేజీ రెండో సంవత్సరం విద్యార్థి సనత్ ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నాం. ఆత్మహత్యకు ముందు సనత్ తాను వాట్సాప్ గ్రూప్‌లో 'సారీ మమ్మీ, డాడీ, అన్నయ్య నేను చనిపోతున్నా' అంటూ మేసేజ్ పెట్టాడు. ఫార్మా పరీక్ష అయినాక ఆత్మహత్య చేసుకుందామని అనుకున్నాడు. కాని మేడమ్, ఫ్రెండ్స్ డిస్టర్బ్ అవుతారని చేయలేదని వాటాప్స్‌లో మేసేజ్ పెట్టాడు.

– విజయ్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ



సనత్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

వైద్య విద్యార్థి సనత్‌కు కన్నీటి నివాళి

నిజామాబాద్ సిటీ: ఆత్మహత్య చేసుకున్న మెడికో సనత్‌కు వైద్య విద్యార్థులు కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రభుత్వ ఆస్పత్రి పోస్టుమార్టం గది వద్ద మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర ఇందిరా, వైద్యులు, మెడికోలు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సనత్ ఫ్లెక్సీతో ఆస్పత్రి గేట్ వరకు ర్యాలీగా వచ్చి వీడ్కోలు పలికారు.




సనత్ మృతితో విలపిస్తున్న స్నేహితులు



విద్యార్థి తల్లిని ఓదారుస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ఇందిర



సనత్ ఆత్మహత్య చేసుకున్న హాస్టల్ ఇదే



తల్లిదండ్రులకు సనత్ పంపించిన వాట్సాప్ మెస్సేజ్

కలిసిరాని యాసంగి..

- తగ్గిన వరి పంట దిగుబడి
- దెబ్బతీసిన తెగుళ్లు, వడగళ్లు
- ఎకరానికి 25 క్వింటాళ్లు కూడా రాని పరిస్థితి
- అసంతృప్తిలో రైతన్నలు
- జిల్లాలో మొదలైన వరి కోతలు



నందిపేట మండలం బజార్‌కొత్తూర్‌లో వరి పంట కోస్తున్న దృశ్యం

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): ఈ ఏడాది యాసంగి సీజన్ రైతులకు కలిసిరాలేదు. నాట్లు వేసిన రోజు మొదలుకొని పంట కోసే దాకా వరిపై తెగుళ్లు దాడి చేశాయి. రెక్కల పురుగు, మొగిపురుగు, ఉల్లికోడు, అగ్గి తెగులు, మెడ విరుపు లాంటి తెగుళ్లు పంటలను దెబ్బతీశాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు పరిమితికి మించి మందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. అక్కడక్కడా కొన్ని పంటలు మాత్రమే గట్టెక్కాయి. ప్రస్తుతం పంట చేతికివచ్చే సమయం వచ్చింది. పలు ప్రాంతాల్లో వరికోతలు కూడా మొదలయ్యాయి. అయితే, పంట దిగుబడి తగ్గడంతో రైతులు ఆందోళన పడుతున్నారు. ఎకరానికి 28 క్వింటాళ్లు రావాల్సిన పంట, 20–25 క్వింటాళ్లు మాత్రమే వస్తుందని వాపోతున్నారు. ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లు నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి సాధారణ సాగు విస్తీర్ణం 2,81,619 ఎకరాలుండగా, ఈ ఏడాది యాసంగిలో 3,67,379 ఎకరాల్లో వరి సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అంచనాలకు మించి గతేడాది కంటే ఎక్కువగా 4,00,410 ఎకరాల్లో (142 శాతం) సాగైంది. రైతులు సన్నాలను ఎక్కువగా సాగు చేశారు. 11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ, తెగుళ్ల దాడి చేయడంతో దిగుబడిపై ప్రభావం పడింది. దీనికి తోడు ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగళ్లతో వరి గింజలు నేల రాలాయి. తద్వారా దిగుబడి మరింత తగ్గింది. యాసంగిలో కాలం కలిసి రాకపోవడంపై రైతులు అసంతృప్తిగా ఉన్నారు.

కోత యంత్రాల రేట్లు పెరిగినై..

పంటలు కోతకు రావడంతో వరి కోత యంత్రాలు జిల్లాకు వస్తున్నాయి. యాసంగిలో ముందుగా నాట్లు వేసిన పంటలను కోస్తున్నారు. అయితే, కోత యంత్రాల ధరలు గత సీజన్ కంటే పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. గంటకు రూ. 1600 వరకు తీసుకునే యంత్రాల యజమానులు ప్రస్తుతం టైర్లతో నడిచే యంత్రానికి రూ. 1800 నుంచి రూ. 2000 వరకు తీసుకుంటున్నారు. అదే చైన్‌తో నడిచే కోత యంత్రాలకు గంటకు రూ. 2,500 దాకా కిరాయి తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారు. దిగుబడి రాక నష్టాల్లో ఉన్న రైతులకు వరికోత యంత్రాల ధరలు భారంగా మారుతున్నాయని వాపోతున్నారు.

“ రెండు ట్రాక్టర్లు తగ్గింది



ఇందల్వాయి మండలం నల్లవెల్లి గ్రామంలో నాకున్న ఐదెకరాల భూమిలో వరిపంట సాగు చేశాను. కోత కోయగా ఎనిమిది ట్రాక్టర్లు మాత్రమే దిగుబడి వచ్చింది. గతేడాది ఇదే సీజన్‌లో పది ట్రాక్టర్ల నిండా వడ్లు వచ్చాయి. తెగుళ్ల కారణంగా ఈసారి రెండు ట్రాక్టర్లు తగ్గింది.

– చింతలపల్లి ప్రవీణ్ రెడ్డి, యువరైతు, నల్లవెల్లి

సీపీ నాగరాజుకు వీడ్కోలు

- పోలీసుల సహకారాన్ని సీపీ సంపూర్ణంగా పొందగలిగారు
- ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి



సీపీ నాగరాజును సన్మానిస్తున్న ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి

ఖలీల్‌వాడి: పోలీసుల సహాయ సహకారాలను సీపీ కేఆర్ నాగరాజు సంపూర్ణంగా పొందగలిగారని ఐజీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీపీ నాగరాజు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజీపీ మాట్లాడారు. అనంతరం సీపీని సన్మానించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్, జగిత్యాల, నిర్మల్ ఎస్పీలు ఉదయ్‌కుమార్, భాస్కర్, ప్రవీణ్‌కుమా ర్, అదనపు డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

సిబ్బంది సహకారంతో..

పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బంది సహకారంతో సమర్థవంతంగా విధులు నిర్వహించినట్లు సీపీ నాగరాజు అన్నారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం సీపీ నాగరాజుకు ఆర్మూర్ రిజర్వు పోలీసు సిబ్బంది వీడ్కోలు పలికారు. వారి నుంచి సీపీ గౌరవ వందనం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ఎక్కడ అవాంఛనీయ సంఘటన లు జరగకుండా, ఎలాంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని రకాల బందోబస్తులకు వెళ్లిన అక్కడ అధికారుల మన్ననలు పొందారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ గిరిరాజు, పరిపాలన అధికారి మధుసూదన్‌రావు, ఏసీపీలు కిరణ్‌కుమార్, సంతోష్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం పాల్గొన్నారు.



సీపీ కారును తాడుతో లాగుతూ వీడ్కోలు పలుకుతున్న పోలీసులు

న్యూస్‌రీల్

ఉపాధి కూలి పెంపు

- నేటి నుంచి అమలులోకి..

ఇందూరు(నిజామాబాద్ అర్బన్): ఉపాధి హామీ కూలీలకు వేసవి భత్యాన్ని తొలగించిన కేంద్ర ప్రభుత్వం దినసరి కూలీని పెంచి స్వల్ప ఊరట కల్పించింది. ఇది వరకు రూ. 257గా ఉన్న కూలీని, రూ. 15 పెంచి రూ. 272కు చేసింది. పెంచిన వేతనాలను ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి తెస్తూ అధికారులకు ఆదేశాలు ఇచ్చింది. తద్వారా ఇకపై ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీలకు కొంత పెరగనుంది. జిల్లాలో 2,69,261 జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 5,55,512 సభ్యులున్నారు. యాక్టివ్ కూలీలు 2,90,448 మంది ఉండగా, ప్రస్తుతం రోజుకు 15వేల మంది వరకు పనులకు వస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1,073 కుటుంబాలు వంద రోజుల పనులు పూర్తి చేసుకున్నాయి.

స్త్రీనిధి రుణాల్లో నిజామాబాద్ టాప్

- మంత్రి దయాకర్‌రావు చేతుల మీదుగా అవార్డు అందుకున్న డీఆర్‌డీవో



ఇందూరు(నిజామాబాద్ అర్బన్): స్త్రీనిధి రుణాలు అందజేయడంలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో రూ. 208.18కోట్ల(104శాతం) రుణాలను 41,209 మంది మహిళా సంఘ సభ్యులకు అందజేశారు. ఇందుకు గాను శుక్రవారం హైదరాబాద్ శిల్పాకళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి దయాకర్ రావు చేతుల మీదుగా డీఆర్‌డీవో చందర్ నాయక్ అవార్డు అందుకున్నారు.

కామారెడ్డి జిల్లాకు మూడో స్థానం

సాక్షి, కామారెడ్డి: 2021–22 సంవత్సరంలో స్త్రీ నిధి కార్యక్రమాల అమలులో కామారెడ్డి జిల్లా రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. స్త్రీ నిధి రుణాల రికవరీ, రుణాలు ఇవ్వడంలో ప్రగతిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన స్త్రీ నిధి జనరల్ బాడీ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి(డీఆర్‌డీవో) సాయన్న అవార్డు అందుకున్నారు.

పెరిగిన ఆదాయం..

- గతేడాది కంటే రూ.2.69కోట్లు అధిక రెవెన్యూ..
- భూగర్భ గనులశాఖ పరిధిలో కొనసాగుతున్న 55 క్వారీలు..

సుభాష్‌నగర్: జిల్లాలో భూగర్భ గనులశాఖ ఆదాయం పెరిగింది. గతేడాది కంటే రూ. 2.69 కోట్లు అధికంగా రెవెన్యూ సమకూరింది. మైనింగ్‌శాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా 55 వివిధ రకాల క్వారీలు కొనసాగుతున్నాయి. వాటి ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. జిల్లాలో గ్రానైట్ క్వారీలు 13, కంకర క్వారీలు 32, క్వార్ట్‌జ్ 3, మొరం క్వారీలు 7 ఉన్నాయి. గతేడాది భూగర్భ గనులశాఖకు క్వారీల ద్వారా రూ. 17.38 కోట్లు సమకూరగా, 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ. 20.07 కోట్ల ఆదాయం వచ్చింది. అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు వివిధ రకాల క్వారీలను పరిశీలించి వే బిల్లుల ఆధారంగా కొనసాగుతున్నాయా.. లేదా అనేది పరిశీలిస్తున్నారు. గ్రానైట్, కంకర క్వారీల ద్వారానే మైనింగ్ శాఖకు అధికంగా ఆదాయం సమకూరనుంది.

నేడు సైకిల్ ర్యాలీ

నిజామాబాద్‌నాగారం: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా న్యాయసేవా సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి సునీత కుంచాల ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోగ్యంపై అవగాహన ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని జిల్లా సైక్లింగ్ సంఘం సహకారంతో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 7 గంటలకు జిల్లా కోర్టు వద్ద సైకిల్ ర్యాలీ ప్రారంభమై పూలాంగ్ చౌరస్తా వరకు కొన సాగుతుందన్నారు. కోర్టుచౌరస్తా ఎల్ఐసీ చౌరస్తా, దేవిథియేటర్ చౌరస్తా, పూలాంగ్ చౌరస్తా వరకు తిరిగి అదే రూ ట్లో జిల్లా కోర్టు వద్ద ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు.

క్లుప్తంగా

శక్కర్‌నగర్ రామాలయానికి ఐఎస్‌వో సర్టిఫికెట్



బోధన్‌టౌన్: బోధన్ శక్కర్‌నగర్ కాలనీలోగల శ్రీరామ ఆలయానికి ఓటాబు సంస్థ వారు ఐఎస్‌వో సర్టిఫికెట్ అందించారు. ఆలయ నిర్వహణ, వివిధ కార్యక్రమాల్లో ఆలయ పాత్ర వంటి అంశాలపై ఓటాబు సంస్థకు ఆలయ కమిటీ దరఖాస్తు చేసింది. సంస్థ ప్రతినిధి రామలక్ష్మి శుక్రవారం ఆలయ కమిటీ ప్రతినిధులకు సర్టిఫికెట్ అందజేశారు.

పీఆర్ ప్రిన్సిపల్ సెక్రెటరీని కలిసిన జెడ్పీ చైర్మన్



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో జరిగిన పంచాయతీరాజ్ అవార్డుల ప్రదానోత్సవంలో శుక్రవారం జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్(పీఆర్) శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియాను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే మంత్రి కేటీఆర్‌ను సైతం కలిశారు.

సానిటేషన్‌పై దృష్టి పెట్టాలి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది శానిటేషన్‌పై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత పవన్‌తో సానిటేషన్‌పై చర్చించారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ డీఈఈ భూమేశ్వర్, ఏఈఈ రఘు ఉన్నారు.

పసుపునకు ప్రత్యేక బోర్డు లేదు

- స్పైసిస్ బోర్డులో భాగమే..
- లోక్‌సభలో వెల్లడించిన వాణిజ్య, పరిశ్రమల సహాయ మంత్రి అనుప్రియ
- బోర్డు ఏర్పాటు కాకపోతే తమకు ప్రయోజనం లేదంటున్న రైతులు



మోర్తాడ్‌లో సాగవుతున్న పసుపు పంట(ఫైల్)

మోర్తాడ్: పసుపు బోర్డు ఏర్పాటుకు ఎలాంటి ప్రతిపాదన లేదని స్పైసిస్ బోర్డులోనే పసుపు ఒక భాగం అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల సహాయ మంత్రి అనుప్రియా పాటిల్ లోక్‌సభలో మరోసారి స్పష్టం చేయడంతో పసుపు రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. పసుపు అధికంగా సాగు చేస్తున్న నిజామాబాద్ జిల్లాలో బోర్డు ఏర్పాటు చేయాలని రైతులు మొదటి నుంచి డిమాండ్ చేస్తున్నారు. మిర్చి, తంబాకు పంటలకు ప్రత్యేకమైన బోర్డులు ఉన్నట్లు పసుపు పంటకు బోర్డు ఉంటే సాగు విస్తీర్ణం నియంత్రణలో ఉంటుందని రైతులు చెబుతున్నారు. పసుపు సాగులో మెళకువలు నేర్పించడం, మేలు రకమైన విత్తనాలు అందుబాటులోకి తీసుకరావడం, పంటకు ధర నిర్ణయం, పసుపు ఉత్పత్తులకు సంబంధించిన పరిశ్రమల ఏర్పాటు ఇలా ఎన్నో రకాల ప్రయోజనాలు బోర్డుతోనే సాధ్యమవుతాయని రైతులు వెల్లడిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఎంపీగా పోటీచేసి గెలిచిన అర్వింద్ బోర్డు ఏర్పాటుకు కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు. ఎన్నికల తర్వాత పసుపు బోర్డుకంటే మెరుగైన సేవలు, సౌకర్యాలను కల్పించే స్పైసిస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని నిజామాబాద్‌లో ఏర్పాటు చేయించానని ఎంపీ స్పష్టం చేశారు. కొంత కాలంగా పసుపు బోర్డు గురించి ఎంపీ ఎలాంటి వ్యాఖ్యలు చేయడం లేదు. తాజాగా పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణకు చెందిన బీఆర్ఎస్ ఎంపీలు వెంకటేష్ నేత, పసునూరి దయాకర్, డాక్టర్ రంజిత్‌రెడ్డి, మాలోతు కవిత పసుపు బోర్డు అంశాన్ని చర్చకు తీసుకవచ్చారు. దీనికి వాణిజ్య, పరిశ్రమల సహాయ మంత్రి సమాధానం ఇస్తూ పసుపు బోర్డు ఏర్పాటు ప్రతిపాదన ఏది లేదని తెలిపారు. 52 రకాల సుగంధ ద్రవ్యాలకు సంబంధించిన స్పైసిస్ బోర్డు ఒక్కటే పని చేస్తుందని పసుపు ఇందులో భాగం అని వెల్లడించారు. దీంతో పసుపు బోర్డు ప్రతిపాదన ఏది కేంద్రం దృష్టిలో లేదని తేటతెల్లమైంది. పసుపు బోర్డు ఏర్పాటుపై కేంద్రానికి ఆసక్తి లేదని తెలియడంతో రైతులు అసంతృప్తికి గురవుతున్నారు. తమ చిరకాల వాంఛైన పసుపు బోర్డు ఏర్పాటు చేయకపోవడంపై రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీ మాట తప్పారు



పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి ఎంపీ అయిన అర్వింద్ ఇప్పుడు మాట తప్పడం సరికాదు. పసుపు రైతులు ఎన్నో ఏళ్లుగా బోర్డు కోసం ఆశతో ఎదురు చూస్తున్నారు. బోర్డు ఏర్పాటుతోనే పసుపు సాగు చేసే రైతుల కష్టాలు తీరుతాయి.

– దొన్కల్ సంజీవరెడ్డి, రైతు నాయకుడు

కేంద్రం పునరాలోచన చేయాలి



పసుపు బోర్డు ఏర్పాటు అంశాన్ని కేంద్రం పట్టించుకోకపోవడం సరికాదు. ఎంతో మంది రైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయంలో ప్రభుత్వం పట్టింపు లేకుండా ఉండటం సరైంది కాదు. పసుపు బోర్డును ఏర్పాటు చేయకపోతే రైతులు ఉద్యమిస్తారు.

– గడ్డం లింగారెడ్డి, రైతు, గుమ్మిర్యాల్

ఘనంగా రథోత్సవం



సాక్షి, కామారెడ్డి: గాంధారి మండలం గౌరారంలోని రామాంజనేయ ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. వేలాది మంది భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. శనివారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

తెయూలో ముగ్గురికి పీహెచ్‌డీ



ప్రసన్నకుమారి



శంకర్‌నాయక్



శ్రీధర్‌బాబు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగంలో డోండి ప్రసన్నకుమారి, మాస్ కమ్యూనికేషన్ విభాగంలో గుగులోత్ శంకర్ నాయక్, పసునూరి శ్రీధర్‌బాబు శుక్రవారం పీహెచ్‌డీ సాధించారు. బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకురాలు కాసుల కిరణ్మయి పర్యవేక్షణలో ప్రసన్నకుమారి 'ఇన్ విట్రో జనరేషన్ జెనెటిక్ ట్రాన్స్‌ఫర్‌మిషన్ స్టడీస్ (గస్ కైటానెస్ జీన్స్) అండ్ రెస్పాన్స్ ఆఫ్ యాంటీ ఆక్సిడెంట్ డిఫెన్స్ సిస్టం ఎట్ హై టెంపరేచర్ ఇన్ కర్కుమ్మ లోంగా' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంతగ్రంథం సమర్పించారు. మాస్ కమ్యూనికేషన్ అధ్యాపకుడు వై ప్రభంజన్‌యాదవ్ పర్యవేక్షణలో 'ద యూస్ ఆఫ్ మీడియా ఇన్ స్వచ్ఛభారత్ మిషన్' అనే అంశంపై గుగులోత్ శంకర్‌నాయక్ పరిశోధన గ్రంథం సమర్పించారు. మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ఘంటా చంద్రశేఖర్ పర్యవేక్షణలో పసునూరి శ్రీధర్ బాబు 'తెలంగాణ ఉద్యమంలో టెలివిజన్ వార్తల ప్రభావం' అనే అంశంపై పరిశోధన చేశారు. శుక్రవారం వీరికి వైవా నిర్వహించి పీహెచ్‌డీ అంజేశారు. కార్యక్రమాల్లో వీసీ రవీందర్‌గుప్తా, బయోటెక్నాలజీ హెచ్‌వోడీ జవేరియా ఉజ్మ, బీవోఎస్ చైర్మన్ పర్సన్స్ మామిడాల ప్రవీణ్, శాంతాబాయి, సైన్స్ డీన్ సీహెచ్ ఆరతి, కంట్రోలర్ ఎం అరుణ, ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



బాలికల హాస్టల్ మెస్‌లో భోజనం చేస్తున్న వీసీ రవీందర్, చీఫ్ వార్డెన్ మహేందర్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ బాలికల హాస్టల్‌ను వీసీ డి రవీందర్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఇటీవల కొందరు బాలికలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హాస్టల్‌లో విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి వీసీ భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హాస్టల్ విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. హాస్టల్స్ చీఫ్ వార్డెన్ మహేందర్, వార్డెన్ జవేరియా ఉజ్మా, ఏఈ వినోద్, సూపరింటెండెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

'గ్లోబల్ ఫ్యాకల్టీ అవార్డు' గర్వకారణం

తెయూ(డిచ్‌పల్లి): ఎకనామిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వప్న జాతీయ స్థాయిలో బోధన, పరిశోధనలో ప్రతిభ కనబరిచి గ్లోబల్ అవార్డు అందుకోవడం యూనివర్సిటీకి గర్వకారణమని వీసీ రవీందర్‌గుప్తా అన్నారు. శుక్రవారం అవార్డు గ్రహీత స్వప్నను వీసీ తన ఛాంబర్‌లో సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. స్వప్నకు పాలకమండలి సభ్యులు కే రవీందర్‌రెడ్డి, ఎకనామిక్స్ విభాగాధిపతి సంపత్, బీవోఎస్ చైర్మన్ పున్నయ్య, అధ్యాపకులు నాగరాజు, శ్రీనివాస్, దత్తహరి, న్యాయ శాస్త్ర విభాగాధిపతి స్రవంతి అభినందనలు తెలిపారు.

పీజీ పరీక్షా కేంద్రాల తనిఖీ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం.అరుణ తెలిపారు. తెయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ పరీక్షా కేంద్రాన్ని వీసీ రవీందర్‌గుప్తా తనిఖీ చేశారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ప్రిన్సిపాల్ ఆరతికి సూచించారు. తెయూ సౌత్‌క్యాంపస్ (భిక్కనూర్) పరీక్షా కేంద్రాన్ని కంట్రోలర్ అరుణ తనిఖీ చేశారు.

వైద్య సేవలను ప్రజల చెంతకు చేర్చాలి



ఇందల్వాయి : ఇందల్వాయి పీహెచ్‌సీని కేంద్రాన్ని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డా. ఉష్మ శుక్రవారం సందర్శించారు. టీబీ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆమె వైద్యసిబ్బందికి సూచించారు. జిల్లా వైద్యాధికారి డా.సుదర్శనం మాట్లాడుతూ టీబీ నియంత్రణలో జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యుడు సంతోష్, హెచ్ఈవో శంకర్, టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనంలో నిబద్ధతతో వ్యవహరించాలి



నిజామాబాద్‌అర్బన్: మూల్యాంకనం విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు నిబద్ధతతో వ్యవహరిస్తూ జాగ్రత్తగా వాల్యుయేషన్ చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఇంటర్మీడియట్ మూల్యాంకన కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి డీఐఈవో రఘురాజ్ అధ్యక్షత వహించారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అధ్యాపకుడు నిబంధనల ప్రకారం వ్యవహరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దని సూచించారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి రఘురాజ్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనల మేరకు ప్రతి ఒక్కరు సమయపాలన పాటిస్తూ తమకు కేటాయించిన మూల్యాంకన విధుల్లో నిమగ్నమై పని చేయాలన్నారు.

మెడికోల ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలి

నిజామాబాద్‌అర్బన్: మెడికల్ కళాశాల విద్యార్థి సనత్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ డిమాండ్ చేశాడు. శుక్రవారం మెడికల్ కళాశాలలో విద్యార్థి మృతి చెందిన హాస్టల్‌ను సందర్శించి అనంతరం మాట్లాడారు. నెలరోజుల క్రితమే హర్ష అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నారని ఇప్పుడు సనత్ మృతి చెందాడన్నారు. గతంలోనే కళాశాలలో సీ సీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోలేదన్నారు. విద్యార్థి మృతిపై తమకు అనుమానాలున్నాయన్నారు. నాయకులు సయ్యద్ అష్రఫ్, లక్ష్మణ్ వర్మ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆత్మహత్యలకు నిలయంగా మారుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాచకొండ విగ్నేష్ ఒక ప్రకటనలో విమర్శించారు.

నిజామాబాద్‌అర్బన్: మెడికల్ కాలేజీలో సనత్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో పీడీఎస్‌యూ నాయకులు మెడికల్ కాలేజీకి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ.. వరంగల్ మెడికల్ కాలేజీ విద్యార్థి ధరావత్ ప్రీతి మృతి, నిజామాబాద్‌లో హర్ష మృతి ఘటన మరువకముందే అదే కళాశాలలో చదువుతున్న సనత్ ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. మెడికోల ఆత్మహత్యలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిపాల్, రాజేష్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్: మెడికల్ కళాశాలలో విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సందగిరి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కళాశాలలో విద్యార్థి సనత్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకొని కళాశాలకు వెళ్లి పరిశీలించారు. ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. కళాశాలలో తరచూ ఇలాంటి ఘటనలు జరగడం విస్మయానికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మానసిక వికాస శిక్షణ తరగతులను పెట్టాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎర్రం సుధీర్, పిల్లి శ్రీకాంత్, దాత్రిక రమేష్, సాయి, మేదరి శేఖర్ పాల్గొన్నారు.

నిజాంసాగర్ కాలువలో బాలుడి గల్లంతు

నస్రుల్లాబాద్: మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో గల నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఓ బాలుడు (8) శుక్రవారం గల్లంతయ్యాడు. బాలుడి తాత ఇప్పిర్గా సాయిలు చనిపోవడంతో తల్లితో కలిసి గ్రామానికి వచ్చాడు. బట్టలు ఉతకడానికి వెళ్లిన కుటుంబ సభ్యులతో వెళ్లిన బాలుడు కాలు జారి కాలువలో పడ్డాడు. గజ ఈతగాళ్లతో గాలించినా ఆచూకీ లభించలేదు. దీనిపై పోలీసులను వివరాలు అడగ్గా తమకు ఎటువంటి సమాచారం లేదన్నారు.

క్రైం కార్నర్

కల్లుసీసాలో బొద్దింక



నాగిరెడ్డిపేట: మండలంలోని నాగిరెడ్డిపేటలో గల కల్లు దుకాణంలో గురువారం రాత్రి కొనుగోలు చేసిన కల్లుసీసాలో బొద్దింక ప్రత్యక్షమైంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దుకాణంలో కొనుగోలు చేసిన కల్లుసీసాను ఇంటికి తీసుకువెళ్లి తాగే క్రమంలో అందులో బొద్దింక కనిపించింది. దీంతో ఆందోళనకు గురైన సదరు వ్యక్తి కల్లుసీసాను తీసుకొని స్థానికులతో కలిసి దుకాణానికి వెళ్లి నిర్వాహకులను నిలదీశారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని నిర్వాహకులు గ్రామస్తులకు నచ్చజెప్పి పంపించారు.

భారీ వాహనం బోల్తా



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ శివారులో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం భారీ వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. జగిత్యాల జిల్లా నుంచి ఆర్మూర్ వైపు వస్తున్న వాహనం చేపూర్ శివారు మూలమలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది.

గంజాయి కేసులో ఐదేళ్ల జైలు

ఖలీల్‌వాడి: గంజాయి రవాణ చేస్తూ పట్టుబడిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ మొదటి అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి శ్రీనివాస్‌రావు తీర్పు వెలువరించారు. కోర్టు తీర్పు వివరాలు.. నిజామాబాద్‌లోని మార్వాడిగల్లీలోని రాంగోపాల్‌వీధికి చెందిన భగవాన్‌దాస్‌చౌదరి చిన్న వయస్సు నుంచే గంజాయి రవాణా చేసేవాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి గంజాయిని తీసుకొచ్చి చిన్న, చిన్న ప్యాకెట్లులో పెట్టి రూ.200కు అమ్మేవాడు. 2019 ఆగస్టు 7న గంజాయి పౌడర్‌ను నిజామాబాద్ రైల్వేస్టేషన్ నుంచి తీసుకొని వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. దీనిపై ఒకటో టౌన్ సీఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి విచారణ పూర్తి అయిన తర్వాత నిందితుడిపై అభియోగ పత్రం కోర్టులో దాఖలు చేశారు. విచారణ అనంతరం కోర్టు నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనర్సయ్య వాదనలు వినిపించారు. కార్యక్రమంలో కోర్టు లైజన్ అధికారి శ్యాంకుమార్, విట్‌నెస్ బ్రీఫింగ్ ఆఫీసర్ విజయ్‌బాబు, కోర్టు కానిస్టేబుల్ గజానంద్, హెచ్‌జీ రవి తీర్పు సమయంలో హాజరయ్యారు.

పొలంలో పడి రైతు మృతి

రామారెడ్డి: పొలానికి వెళ్లిన రైతు ఫిట్స్ వచ్చి పొలంలో పడి మృతి చెందిన ఘటన గురువా రం మండలంలోని అన్నారంలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాలు.. గ్రా మానికి చెందిన రాజయ్య అల్లుడు పుట్టి బాలకృష్ణ(35) గురువారం ఉదయం పొలానికి వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పొలంలో విగతజీవిగా పడి ఉన్నాడు. తన భర్తకు ఫిట్స్ వచ్చి పొలంలో బోర్ల పడటంతో ఊపిరాడక మృతి చెందాడని ఆయన భార్య సౌజన్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

బోధన్‌టౌన్: బోధన్ శివారులో పెగడాపల్లి రోడ్డు పక్కన గల కాలువలో శుక్రవారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. కాలువలో మృతదేహాన్ని చూసిన స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిందని, వారం క్రితం మృతి చెంది ఉండవచ్చని సీఐ ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. మృతురాలి వయసు 40 నుంచి 45 ఏళ్లు ఉంటాయన్నారు.

కొడుకే కాలయముడయ్యాడు

- తల్లిదండ్రులను చెరువులో తోసేసిన కొడుకు
- తండ్రి మృతి, అపస్మారక స్థితిలో తల్లి
- కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘటన



సలీం మృతదేహం

కామారెడ్డి క్రైం: జులాయిగా తిరిగే కొడుకు.. తల్లిదండ్రుల పాలిట కాలయముడయ్యాడు. అందరం కలిసి చనిపోదామంటూ చెరువు వద్దకు తీసుకువెళ్లి, తల్లిదండ్రులను చెరువులో తోసేయడంతో.. తండ్రి నీట మునిగి చనిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న తల్లిని బంధువులు కాపాడారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో నివసించే రేష్మా బేగం, మహ్మద్ సలీం(55) దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహమైంది. చిన్నవాడైన ఖలీం మద్యానికి బానిసై, ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగుతుండడంతో అతడి భార్య విడాకులు ఇచ్చి పుట్టింటికి వెళ్లిపోయింది. ఖలీం తాగుడుకు డబ్బుల కోసం తల్లిదండ్రులను తరచూ వేధించేవాడు. ఇటీవల దుబాయి వెళ్తానని, దానికి డబ్బులు ఇవ్వాలని అడగడంతో తమ వద్ద లేవని వారు చెప్పారు. వారం తర్వాత ఇస్తామన్నా వినకుండా.. తనను ఎందుకు కన్నారంటూ నిత్యం కొడుతుండేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సైతం డబ్బుల కోసం ఇంట్లో గొడవ జరిగింది. ముగ్గురం కలిసి ఆత్మహత్య చేసుకుందామనడంతో తల్లిదండ్రులు సైతం అతడి వెంట కామారెడ్డి పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. చెరువులోకి ముగ్గురూ దిగగా.. ఖలీం వారిని తోసివేయడంతో తల్లిదండ్రులిద్దరూ నీటిలో మునిగిపోయారు. వీరిని బయటకు తీసిన స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న రేష్మ బేగం అల్లుడు ఆటోలో చెరువు వద్దకు చేరుకున్నాడు. రేష్మ బేగం, సలీంలను ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే సలీం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రేష్మ బేగం ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఖలీంపై కేసు నమోదు చేశామని కామారెడ్డి ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్ వద్ద శుక్రవారం గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు. కోరుట్లకు చెందిన పూసల వెంకటేష్, గొడికె నవీన్ నిర్మల్ నుంచి గంజాయిని కొనుగోలు చేసుకుని వచ్చి తడపాకల్ గోదావరి నది తీరంలో విక్రయిస్తున్నారని తమకు సమాచారం అందగా దాడిచేసి పట్టుకున్నామని వెల్లడించారు. ఇద్దరు యువకుల వద్ద 400 గ్రాముల గంజాయి లభ్యమైందని తెలిపారు. గంజాయి విక్రేతలను పట్టుకోవడంలో సహకరించిన ఏఎస్సై ఇస్మాయిల్, కానిస్టేబుళ్లు విజయ్, గంగాధర్, హోంగార్డు జగదీష్‌ను ఎస్సై అభినందించారు. తహసీల్దార్ జనార్దన్ సమక్షంలో నిందితులను విచారించి కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో చోరీకి యత్నించిన ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అయ్యప్ప ఆలయం, రేణుక ఎల్లమ్మ గుడి హుండీ తాళాలు ధ్వంసం చేసి దొంగతనానికి యత్నించిన యువకుడిని శుక్రవారం స్థానికులు పట్టుకున్నారు. ఆ యువకుడు గతంలో కూడా ఇటువంటి ప్రయత్నం చేసినట్లు స్థానికులు తెలిపారు. అనంతరం నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

కట్టెల సరఫరా పేరిట టోకరా

కామారెడ్డి క్రైం: ఆర్మీ క్యాంపునకు పొయ్యిల కట్టెలు సరఫరా చేసే కాంట్రాక్టు ఉందని నమ్మించి రూ.39,829కు టోకరా వేశారు ఆన్‌లైన్ మోసగాళ్లు. ఈ ఘటన శుక్రవారం దేవునిపల్లిలో వెలుగు చూసింది. గ్రామానికి చెందిన సిరికొండ సుదర్శన్‌కు మార్చి 30న ఓ వ్యక్తి ఫోన్ చేసి నిజామాబాద్‌లో ఆర్మీ కాంపునకు పొయ్యిల కట్టెలు సరఫరా చేసే కాంట్రాక్టు ఉందని నమ్మించాడు. అందుకోసం వాట్సప్‌లో లోకేషన్ పంపించి కట్టెలు పంపించుమన్నాడు. మాయ మాటలు చెప్పి విడతల వారిగా డిపాజిట్ పేరిట రూ.39,829ను ఆన్‌లైన్ ద్వారా వేయించుకున్నారు. కట్టెలు డెలవరీ కాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు శుక్రవారం దేవునిపల్లి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

సిరికొండ(ధర్పల్లి): ధర్పల్లి మండల కేంద్రానికి చెందిన వేటూరి శ్రీనివాస్(48) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై వంశీకృష్ణ రెడ్డి శుక్రవారం తెలిపారు. శ్రీనివాస్ కూలీ పని చేసుకొని జీవించేవాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. మద్యం విషయంలో భార్యతో గొడవపడి మార్చి 29న ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని ఎస్సై తెలిపారు. చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నా డు. శుక్రవారం ఉదయం శ్రీనివాస్ మృతదేహం చెరువులో తేలింది. మృతుడి భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో యువకుడు..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని గోల్‌బంగ్లా ప్రాంతంలో నివాసం ఉంటున్న పికిల్ సిద్ధార్థ(17) శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గోలబంగ్లాకు చెందిన సిద్ధార్థ కొంతకాలం క్రితం మతిస్థిమితం కోల్పోయాడు. శుక్రవారం తల్లి అనిత సిద్ధార్థను ఇంట్లో ఉంచి బీడీ ప్యాకింగ్ వెళ్లింది. మధ్యలో సిద్ధార్థకు ఫోన్ చేయగా లిఫ్ చేయలేదు. ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని హాల్‌లో ఉరివేసుకున్నాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుగి తల్లి ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు తెలిపారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న టిప్పర్



ఘటనా స్థలం వద్ద గుమిగూడిన ప్రజలు

కామారెడ్డి క్రైం: కామారెడ్డికి సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం టిప్పర్, వాటర్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను పోలీసులు శ్రమించి కాపాడారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ టిప్పర్ డివైడర్ మధ్యలో చెట్లకు నీరు పోస్తున్న ట్రాక్టర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ కేతావత్ రమేష్ క్యాబిన్‌లో చిక్కుకున్నాడు. దేవునిపల్లి పోలీసులు, స్థానికులు క్రేన్, కట్టర్ సహాయంతో దాదాపు రెండు గంటల పాటు శ్రమించి అతడిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు దేవునిపల్లి ఎస్సై ప్రసాద్ తెలిపారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

సిరికొండ : సమాజంలో రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్సై నర్సింలు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫాం అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు హారిణి, అక్షయ, నిత్యశ్రీ, గుణకరణ్‌లను సైబర్ అంబాసిడర్స్‌గా ఎంపిక చేసి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్థులకు అంబాసిడర్స్ బ్యాడ్జిలను ఎస్సై ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి నిజామాబాద్

ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



వీసీ ఆగ్రహం

తెలంగాణ యూనివర్సిటీలోని హాస్టల్ వంట గదిలో అపరిశుభ్రతను చూసి వీసీ రవీందర్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

- 8లో ▸



యథేచ్ఛగా వన్యప్రాణుల వేట


జిల్లాలో వన్యప్రాణుల వేట యథేచ్ఛగా సాగుతోంది. జింకలు, నెమళ్లు ఇతర వన్య ప్రాణులు వేటగాళ్ల చేతిలో బలవుతున్నాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37.1 /23.6

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం చల్లటి గాలులు వీస్తాయి. రాత్రి చలిగా ఉంటుంది.



కుస్తీమే సవాల్!



- పండుగలు, ఉత్సవాల సందర్భంగా పోటీలు
- పోటాపోటీగా తలపడుతున్న మల్లయోధులు
- పొరుగు రాష్ట్రాల నుంచీ రాక
- ఏడాదికేడాది జనంలో పెరుగుతున్న ఆసక్తి

కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో కుస్తీ పోటీలను తిలకిస్తున్న ప్రజలు

సండే స్పెషల్

తనను మట్టి కరిపించడానికి కండ బలంతో దూసుకొస్తున్న మరో యోధుడి కదలికలను పసిగట్టి, ఎత్తుకుపై ఎత్తులు వేస్తూ, ఒడుపుగా పట్టి దెబ్బతీయడమే కుస్తీ. బహుమతి కోసం కాకుండా విజయానందం కోసం మల్లయోధులు చేసే యుద్ధమిది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాలలో పండుగలు, జాతరల సందర్భంగా కుస్తీ పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లావాసులే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటకల మల్లయోధులూ పాల్గొంటారు. మల్లయుద్ధాన్ని తిలకించడానికి జనం సైతం భారీగా తరలివస్తుండడంతో పోటీలకు ఏటా ఆదరణ పెరుగుతూనే ఉంది. కుస్తీ పోటీలపై సండే స్పెషల్..

– సాక్షి, కామారెడ్డి

-వివరాలు 8లో..

న్యూస్‌రీల్

బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలోని ఈ నెల 3 నుంచి ప్రారంభం కావాల్సిన బీఈడీ మొదటి సెమిస్టర్ థియరీ పరీక్షలు అనివార్య కారణాలతో వాయిదా వేసినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ పరిధిలోని బీఈడీ విద్యార్థులు, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ విషయం గమనించాలన్నారు. తిరిగి పరీక్షలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని కంట్రోలర్ తెలిపారు. వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ www. telang ana university.ac.inలో సంప్రదించాలన్నారు.

గొర్రెల పంపిణీలో పక్కాగా వ్యవహరించాలి



సుభాష్‌నగర్ : గొర్రెల పంపిణీ పథకం అమలులో కలెక్టర్లు క్రియాశీలక పాత్ర పోషించాలని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. శనివారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన సమీక్షలో భాగంగా మంత్రి గొర్రెల పంపిణీ పథకంపై పలు సూచనలు చేశారు. ఇప్పటికే యాభై శాతం మందికి గొర్రెల పంపిణీ పూర్తయిందని, మిగతా లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి డబుల్ బెడ్‌రూమ్ పథకంతో పాటు కంటివెలుగు, ఆరోగ్య మహిళ, తదితర అంశాల ప్రగతిని సమీక్షిస్తూ కీలక సూచనలు చేశారు. నిజామాబాద్‌లో 100 శాతం అద్దాల పంపిణీ చేసిన సందర్భంగా జిల్లా యంత్రాంగాన్ని ఆమె అభినందించారు. కంటివెలుగు శిబిరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సీఎస్ దృష్టికి తెచ్చారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణకు దరఖాస్తులు సమర్పించాలి

సుభాష్‌నగర్ : జీవో నం. 58, 59 ద్వారా అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ భూములు, స్థలాల క్రమబద్ధీకరణకు ఏప్రిల్ 30లోపు మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూముల క్రమబద్ధీకరణకు 2014 జూన్ 2 కటాఫ్ తేదీ ఉండగా, దానికి 2020 జూన్ 02 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం గతనెల 17న ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. నూతనంగా భూ క్రమబద్ధీకరణకు దరఖాస్తులు చేసుకునేందుకు ఏప్రిల్ 1 నుంచి 30 వరకు అవకాశం కల్పించిందన్నారు. దరఖాస్తుకు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్, ఇంటి పన్ను రసీదు, కరెంట్ బిల్లు, తదితర డాక్యుమెంట్లు అవసరమని కలెక్టర్ సూచించారు.

ఎఫ్ఐఆర్‌లపై పోలీసులకు శిక్షణ



ఖలీల్‌వాడి : తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, నిజామాబాద్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయసేవా సదన్‌హాల్‌లో నిజామాబాద్ డివిజన్‌లోని పోలీసులకు ఎఫ్ఐఆర్‌లపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా అదనపు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రాజేష్‌గౌడ్, రహీమొద్దీన్ కలిసి పోలీసులకు శిక్షణనిచ్చారు. ఎఫ్ఐఆర్ నుంచి చార్జీషీట్ వరకు జరుగుతున్న లోపాల నివారణ కేసుల్లో నేరస్తులకు శిక్షణ పడేటట్లు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పెండ్యాల పద్మావతి, పీపీలు రవిరాజ్, కవితరెడ్డి, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు విజయ్‌బాబు, సైరా ప్రతాప్, నరహరి తదితరులున్నారు.

ఫ్లెక్సీ వార్..!

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్, బీజేపీల మధ్య వినూత్నంగా తెరకెక్కిన ఫ్లెక్సీల వార్ తారస్థాయికి చేరింది. ముందుగా ' ఇది మా ఎంపీ గారు తెచ్చిన పసుపు బోర్డు' అంటూ వ్యంగ్యం వ్యక్తీకరిస్తూ రాసిన అక్షరాలతో పసుపు రంగులో ఫ్లెక్సీలు వెలిశాయి. ఇందుకు ప్రతిగా సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలును ఎద్దేవా చేస్తూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ పోటాపోటీ ఫ్లెక్సీలు బీఆర్ఎస్, బీజేపీల మధ్య ముదిరిన యుద్ధమని చెప్పకనే చెప్పిన రహస్యంగా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

- బీజేపీ, బీఆర్ఎస్ హామీలపై పోటాపోటీగా వ్యంగ్యాస్త్రాలు
- ప్రజలను మద్యానికి బానిసలు చేసినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలంటూ రాతలు
- మొన్న పసుపు బోర్డు విషయమై ఎంపీ అర్వింద్‌పై.. నిన్న కేసీఆర్ ప్రభుత్వ హామీలపై వెలసిన ఫ్లెక్సీలు



నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా వెలసిన ఫ్లెక్సీలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లాలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య నువ్వా నేనా అనేలా ఘర్షణ వాతావరణం నెలకొంది. పసుపు బోర్డు తెస్తానని ఎంపీ అర్వింద్ హామీ ఇచ్చి తీసుకురాలేదంటూ బీఆర్ఎస్ శ్రేణులు నిరంతరం విమర్శలు చేస్తూ వస్తున్నారు. బీఆర్ఎస్ హామీలపై బీజేపీ కార్యకర్తలు ప్రతి విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పసుపు బోర్డు విషయమై ఎంపీ అర్వింద్‌ను విమర్శించేలా నిజామాబాద్, డిచ్‌పల్లిల్లో ఫ్లెక్సీలు వెలిశాయి. వీటికి కౌంటర్ అన్నట్లు శనివారం కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో విచ్చలవిడిగా ఫ్లెక్సీలు వెలిశాయి. ఫ్లెక్సీలపై పార్టీల పేర్లు లేకున్నప్పటికీ వీటిని బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులే పెట్టినట్లు అర్థమవుతోంది. నేరుగా క్షేత్రస్థాయిలో విమర్శలు చేసుకోకుండానే.. ఇలా ఫ్లెక్సిబుల్‌గా ఫ్లెక్సీలతో వార్ నడిపిస్తుండడం పట్ల సోషల్ మీడియాలో ఈ అంశాలు వైరల్ అవుతున్నాయి. జిల్లాలోని పలు చోట్ల వెలిసిన ఫ్లెక్సీలను గమనిస్తే ఓ చోట.. 'చెప్పినట్టు వంద రోజుల్లో నిజాం షుగర్ ఫ్యాక్టరీని రీఓపెన్ చేయించి, మా నాన్న, అన్నలతో సెల్ఫీ..' అని రాసి కేసీఆర్, కేటీఆర్‌లతో కవిత దిగిన సెల్ఫీ ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. మరికొన్ని చోట్ల 'రూ.500 కోట్లతో కేసీఆర్ ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఐ సెల్'.., 'నెలకు రూ.3,016 నిరుద్యోగ భృతి ఇదిగో..', 'రైతులకు ఉచిత ఎరువులు ఇవిగో..', 'రైతులకు ఏకకాలంలో రూ.1లక్ష రుణమాఫీ ఇదిగో'.., 'నిరుపేదలకు కేసీఆర్ ఇచ్చిన 120 గజాల డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవిగో'.., 'కేసీఆర్‌కు ఫామ్‌హౌజ్, కవితకు దుబాయ్ బుర్జ్ ఖలీఫాలో ఫ్లాట్, ఆర్మూర్ ఎమ్మెల్యేకు జీ.1 మాల్', మరి నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఏవి?', 'భ్రాంతి.. అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. కాగా ఉపాధి అవకాశాలు కల్పించకుండా ప్రజలను ఉచితాల వైపు మరల్చి, విపరీతంగా చార్జీలు పెంచి ప్రజలను మద్యానికి బానిసలు చేసినందుకు కేసీఆర్ గారికి ధన్యవాదాలు' అని రాసి 'సీఎం గారు మాట ఇస్తే తల నరుక్కుంటాడు.. కానీ ఇచ్చిన మాట తప్పడు' అనే కాప్షన్‌తో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ విశేషంగా స్థానికులను ఆకట్టుకుంది. బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల సెగ్మెంట్లలో అనేక చోట్ల భారీగా ఫ్లెక్సీలు వెలిశాయి.

పకడ్బందీగా పది పరీక్షలు

- గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి
- అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు
- మాస్‌కాపీయింగ్‌కు తావులేదు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఈవో దుర్గాప్రసాద్

సహాయ కేంద్రం 9030282993



సాక్షి ఇంటర్వ్యూ

నిజామాబాద్ అర్బన్ : పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈవో దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. పదోతరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న దృష్ట్యా జిల్లాలో పరీక్షలకు సంబంధించి 'సాక్షి'తో పలు విషయాలను పంచుకున్నారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చని వెల్లడించారు.

ప్రశ్న: పరీక్షలకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు..?

జవాబు: పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. జిల్లాలో 138 సెంటర్లలో పరీక్షలు జరుగుతాయి. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను కేటాయించాం.

■ మాస్ కాపీయింగ్‌ను కట్టడి ఎలా..?

✤ పది పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా చాలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశాం. ప్రతి సెంటర్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఇప్పటికే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం. మాస్ కాపీయింగ్ అనుమానాలున్న ప్రాంతాల్లో సెంటర్లపై నిఘా పెట్టాం. మాస్ కాపీయింగ్ నిరోధానికి ప్రత్యేక బృందాలున్నాయి. అలాగే మాస్ కాపీయింగ్ జరిగితే సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్లను, డిపార్ట్‌మెంట్ అధికారులను బాధ్యులను చేస్తాం. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ పెట్రోలింగ్ కూడా ఉంది.

■ ప్రైవేట్ స్కూళ్లకు ఎక్కువ సెంటర్లు ఇచ్చారని విమర్శలున్నాయి.

✤ అలాంటిదేమీ లేదు. మౌలిక సదుపాయాలు దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉన్న వాటిని, సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్న వాటిని ఎంపిక చేశాం. విద్యార్థులకు దగ్గరగా ఉన్న సెంటర్లను ఎంపిక చేసి పరీక్షలు నిర్వహిస్తున్నాం. అయినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎక్కువ సెంటర్లున్నాయి.

■ హాల్ టికెట్లలో తప్పులుంటే ఏం చేయాలి?

✤ హాల్ టికెట్లపై చిన్నచిన్న తప్పులున్నా పరీక్షలకు అనుమతిస్తాం. అక్కడ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పరిశీలన చేస్తారు. ఇప్పటికే విద్యార్థులంతా హాల్ టికెట్లు సరిచూసుకున్నారు.

■ పేపర్లపై కొత్త నిబంధనలేమైనా ఉన్నాయా?

✤ ఈ ఏడాది కేవలం ఆరు పేపర్లతోనే పరీక్షలు నిర్వహిస్తున్నాం. కొత్త నిబంధనలేమీ లేవు. కేవలం పేపర్ల సంఖ్య మాత్రమే తగ్గింది. విద్యార్థులకు ఓఎంఆర్ షీట్ ఉంటుంది. ఇతర అంశాలను ఇన్విజిలేటర్లు తెలియజేస్తారు.

■ వేసవిలో పరీక్షలపై ప్రత్యేక చర్యలేమిటి..?

✤ ఎండలు పెరుగుతున్నందున పరీక్ష సెంటర్లలో తాగునీటి సముదాయం, ఫ్యాన్లు అందుబాటులో ఉంటాయి. వైద్యసిబ్బంది కూడా అందుబాటులో ఉంటారు. శానిటేషన్ కూడా పూర్తయ్యింది.

పది పరీక్షల వివరాలివి..

మొత్తం విద్యార్థులు	21590
బాలికలు	10,675
బాలురు	10915
పరీక్ష కేంద్రాలు	138
చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు	138
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు	07
సిట్టింగ్‌స్క్వాడ్‌లు	138

పరీక్ష సమయం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం12.30 గంటల వరకు..

సైక్లింగ్‌తో శారీరక, మానసిక ఉత్తేజం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

ఖలీల్‌వాడి : సైక్లింగ్‌తో శారీరక మానసిక ఉత్తేజం కలుగుతుందని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం ఉదయం 7 గంటలకు జిల్లా కోర్టు నుంచి సైకిల్ ర్యాలీని ఆమె ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ సైక్లింగ్ ర్యాలీ జిల్లా కోర్టు నుంచి వయా కోర్టు చౌరస్తా, కపిల హోటల్, దేవి థియేటర్ చౌరస్తా, నిఖిల్ సాయి హోటల్ ఎదురు నుంచి పులాంగ్ చౌరస్తా వరకు, తిరిగి జిల్లా కోర్టులో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆరోగ్యం ప్రాముఖ్యత చాటి చెప్పేదెందుకు ఈ సైకిల్ ర్యాలీని నిర్వహించినట్లు చెప్పారు. అన్ని వయస్సుల వారికి సైక్లింగ్ ఉపయోగపడుతుందన్నారు. సైక్లింగ్‌ను ప్రతి రోజు దిన చర్యగా అలవర్చుకోవాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైక్లింగ్ క్రీడలో పతకాలు సాధించిన శిల్ప చవాస్, రాఘవేంద్ర, మేఘన, తేజస్, మధుశ్రీ సైక్లిస్టులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, సీనియర్ జడ్జి పద్మావతి, న్యాయమూర్తులు కుమారి, భవ్య, కుమారి సౌందర్య, గిరిజ, సీనియర్ న్యాయవాది రాజేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దేవిదాస్ చందన్, కార్యదర్శి భాగి చరణ్, ఉపాధ్యక్షులు ఆశ నారాయణ, సైక్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి భూలోకం విజయకాంత్ రావ్, సైక్లింగ్ సంఘం రాష్ట్ర కోశాధికారి, న్యాయ సేవ సంస్థ పర్యవేక్షకులు పురుషోత్తం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

సీపీ పోస్టుకు ఆ నలుగురు..

- తేల్చనున్న ప్రజాప్రతినిధులు..!
- సోమవారం వరకు ఉత్తర్వులొచ్చే అవకాశాలు
- నిర్మల్ ఎస్పీకి ఇన్‌చార్జి బాధ్యతలు

ఖలీల్‌వాడి : సీపీ నాగరాజు పదవీ విరమణ చేయడంతో ఇప్పుడు కొత్త పోలీస్‌బాస్ ఎవరనే చర్చ పోలీసువర్గాల్లో తీవ్రంగా జరుగుతోంది. ఈ పోస్టు కోసం నలుగురు ఐపీఎస్‌లు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులను కలిసి సీపీ పోస్టు కోసం కలిసి వారు విన్నవించుకున్నట్లు సమాచారం. నిర్మల్ ఎస్పీగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్‌కు నిజామాబాద్ సీపీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పజెప్పారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా వ్యవహరించే కమిషనర్ కోసం వేచి చూస్తున్నారనే ప్రచారం జిల్లాలో ఉంది. జిల్లాలో ఎస్సైలు, సీఐ తదితర పోస్టులకు సదరు ప్రజాప్రతినిధుల సిఫార్సుల లేఖల్లేకుండా పనులు జరగట్లేదని బహిరంగ రహస్యంగా మారింది.

ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని..

వచ్చే సీపీ రెండు మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. దీంతో ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా ఉండే వారి కోసం అన్వేషణ చేస్తున్నట్లు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికలు దగ్గరలో ఉండటంతో పోలీస్‌బాస్ తమకు అనుకూలంగా ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. దీంతో కొత్త కొత్వాల్ కోసం మల్లాగుల్లాలు పడుతున్నారు. సోమవారం నాటికి కొత్త సీపీ ఎవరనేది స్పష్టత వస్తుందని పోలీసువర్గాలు పేర్కొంటున్నాయి.

త్వరగా భర్తీ చేసే అవకాశం..

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కోసం నలుగురు ఐపీఎస్‌ల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఖమ్మం సీపీగా పనిచేస్తున్న విష్ణు వారియర్, గతంలో ఇక్కడ ఏఎస్పీగా పనిచేసిన పద్మజతో పాటు కరీంనగర్‌లో పనిచేస్తున్న ఎస్పీ కోటిరెడ్డి, సీఎంఓలో పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు పేర్లు తెరపైకి వచ్చాయి. గతంలో సీపీగా నాగరాజు నియామకం కాకముందు సీపీగా శ్రీనివాసరావు ప్రయత్నం చేశారు. ఇప్పుడు మాత్రం శ్రీనివాస్‌రావు, కోటిరెడ్డి మధ్యే వ్యవహారం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీస్‌శాఖలో మాత్రం కోటిరెడ్డి సీపీగా బాధ్యతలు చేపడుతారనే చర్చ జోరుగా వినిపిస్తోంది. ఇప్పటికే నిజామాబాద్‌లో ఫ్లెక్సీల రగడ కొనసాగుతున్న నేపథ్యంలో సీపీగా పోస్టును త్వరగా భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు జిల్లాలో ప్రచారం జరుగుతోంది.

విద్యార్థులూ.. ప్రాణాలు తీసుకోవద్దు

- మెడికల్ స్టూడెంట్లకు కలెక్టర్, జెడ్పీ చైర్మన్ విజ్ఞప్తులు

నిజామాబాద్ సిటీ : ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడే మీరే ప్రాణాలు తీసుకుంటే ఎలా అని.. సమస్యలు చెప్పుకుంటే పరిష్కరించుకునే వీలుంటుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. శనివారం రాత్రి జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, రాష్ట్ర మహిళ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, మహిళ కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి తదితరులతో కలిసి మెడికల్ కళాశాల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులకు మనోధైర్యాన్నిచ్చారు. ఆత్మహత్యకు పాల్పడిన సనత్ ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఏడాదిలోపే ముగ్గురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం విచారకరమన్నారు. ఎంబీబీఎస్ ఫస్టియర్ నుంచి పూర్తి అయ్యేంతవరకు ఒక్కో ప్రొఫెసర్‌కు 15 నుంచి 20 మంది విద్యార్థులను అటాచ్ చేసి ప్రతి 15 రోజులకు ఒకసారి ఒక అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తే బాగుంటుందున్నారు. విద్యార్థులకు ఒత్తిడి నుంచి రిలాక్స్ అయ్యేందుకు దినపత్రికలు, మంత్లీ మ్యాగజైన్స్‌లు, జనరల్ నాలెడ్జ్ బుక్స్ ఇస్తే బాగుంటుందని కళాశాల ప్రిన్సిపల్ ఇందిరకు సూచించారు. ఇకనుంచి బాయ్స్, గర్ల్స్ కమిటీలు వేసుకుని మీకు ఉన్న సమస్యలు చెప్పుకోవాలన్నారు. ప్రభుత్వ కళాశాలలో సీట్ రావటం వేలల్లో కొందరికే సాధ్యమవుతుందన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో మెడికల్ కళాశాలలో సనత్ ఆత్మహత్యే చివరిది కావాలన్నారు. మీ తల్లిదండ్రులు మీపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. విద్యార్థులు కోరిక మేరకు హాస్టల్ ఆవరణలో వారం రోజుల్లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ చిత్ర మిశ్రా, ప్రిన్సిపల్ ఇందిరా, వైస్ ప్రిన్సిపల్ నాగ మోహన్, జీజీహెచ్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు